క్లుప్తంగా

లోపాలు లేకుండా రీ-సర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: గ్రామాల్లో రీ-సర్వే పక్కాగా జర గాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో మండల సర్వేయర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రీ-సర్వేలో లోపాలు లేకుండా చూడాలన్నారు. ప్రతి రైతుకు ముందస్తు సమాచారం అందించి సర్వే నిర్వహించాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఈ-పంట నమోదుపై దృష్టి సారించాలన్నారు. మండల సర్వేయర్ రవీంద్ర పాల్, ఆర్ఐ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్న డాక్టర్ సూర్యనారాయణ

మునగపాక: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని బీజేపీ జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యుడు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక బీసీ కాలనీలో సోమవారం ఆయన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. వచ్చే నెల నుంచి రేషన్ డిపోల ద్వారా బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరకులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో మొల్లేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని వినతి

నక్కపల్లి: ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం ఇళ్లు కోల్పోయిన రైతులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని పాటిమీద గ్రామస్తులు సోమవారం ఆర్డీవో వి.వి. రమణకు వినతి పత్రం ఇచ్చారు. నిర్వాసితులకు ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించడంతోపాటు, భూములు, నివాస ప్రాంతాలు కోల్పోయిన వారికి కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు స్థానిక నాయకుడు రోకళ్ల శ్రీను తెలిపారు. సోమవారం నర్సీపట్నంలో ఆర్డీవోను కలిసి వినతి పత్రం ఇచ్చామన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



ఆశ్రమ విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించిన కుటుంబీకులు

అచ్యుతాపురం రూరల్: ధర్మిరెడ్డి సన్యాసిరావు 12వ వర్థంతి సందర్భంగా స్థానిక ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలలో సోమవారం దివ్యాంగ విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం సన్యాసిరావు కుటుంబీకులు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకుడు పి.ఎస్.టి. పట్నాయక్ మాట్లాడుతూ పాత్రికేయుడిగా సన్యాసిరావు ప్రజా సమస్యలపై తన కలం ద్వారా గళం వినిపించారని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఎం.ఎం.శర్మ, ధర్మిరెడ్డి నాయుడుబాబు, ధర్మిరెడ్డి శ్రీను, ధర్మిరెడ్డి అప్పలనాయుడు, ధర్మిరెడ్డి రాజు, రేవతి, కీర్తి సురేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ కోనవానిపాలెం, టీపీ రోడ్డు ఫీడర్ పరిధి గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. లైన్లు ఆర్డీఎస్ పనులు కారణంగా కోనవానిపాలెం ఫీడర్ పరిధిలో కోనవానిపాలెం, సారిపల్లిపాలెం, నక్కపల్లిలో కొంత ప్రాంతం, తిమ్మాపురం, టీపీ రోడ్డు ఫీడర్ పరిధిలో టీపీ రోడ్డు, కొరుప్రోలు, తమ్మాపురం, గాయిత్రీ కళాశాల, చేపల మార్కెట్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తుప్పలతో అవస్థలు



కాకరాపల్లి నుంచి నారాయుడుపాలెం మార్గంలో తుప్పలు

మునగపాక: మండలంలోని కాకరాపల్లి నుంచి నారాయుడుపాలెంకు వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఈ రహదారిపై అటు పరవాడకు, ఇటు అనకాపల్లికి పలు పనులపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పేరుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయంటూ వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజల గగ్గోలు..!

- యలమంచిలి మున్సిపాలిటీలో మంచినీటి ఎద్దడి
- కొన్ని వార్డులకు ట్యాంకర్లతో అరకొరగా నీటి సరఫరా
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పుర ప్రజలు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు



కనకమహాలక్ష్మి ఆలయ సమీపంలో కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు



పట్టణంలోని ధర్మవరంలో ట్యాంకర్ వద్ద నీటి కోసం మహిళల పాట్లు

యలమంచిలి రూరల్: వర్షాకాలంలోనూ పుర ప్రజలు తీవ్ర తాగు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. 2011లో మున్సిపాలిటీగా ఆవిర్భవించిన యలమంచిలిలో ప్రస్తుత 50 వేలకుపైగా జనాభాకు మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన సమగ్ర రక్షిత నీటి పథకం నుంచే ఇప్పటికీ తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. అప్పటి జనాభాతో పోలిస్తే ఇప్పుడు రెండు రెట్లు పెరిగింది. వారి అవసరాలకు అనుగుణంగా పురపాలక సంఘం అధికారులు నీటిని అందించలేకపోతున్నారు. దాంతో కొన్ని వార్డుల్లో రెండు, మూడు రోజులకొకసారి సరఫరా అవుతుంటే, మరికొన్ని చోట్ల అసలు కావడమే లేదని పుర ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

నిత్యం అంతరాయమే

పట్టణంలో తాగునీటి సరఫరాకు నిత్యం అంతరాయం ఏర్పడుతోంది. వారంలో కనీసం ఒకట్రెండు సార్లు నీటి సరఫరా జరగడంలేదు. పురపాలక సంఘం కుళాయిలపైనే ఆధారపడిన ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సరఫరా నిలిచిపోయినపుడల్లా పట్టణంలోని ధర్మవరం, ఎర్రవరం, కొత్త ఎర్రవరం, మిలట్రీ కాలనీ, కొత్తపేట, కోర్టు కూడలి ప్రాంతం, క్లబ్ రోడ్డు, బైపాస్ రోడ్డు, గాంధీనగరం, సైతారుపేట రోడ్డు, యాతపేట తదితర ప్రాంతాలకు నీటి సరఫరాలో తరచుగా అంతరాయం ఉంటోంది. దీంతో ఆయా కాలనీల్లో ప్రజలు నీటి అవసరాల కోసం పాట్లు పడాల్సి వస్తోంది. అంతరాయం ఉన్నపుడు ట్యాంకర్ల ద్వారా పురపాలక సంఘం అధికారులు సరఫరా చేస్తున్న నీరు ప్రజల అవసరాలను ఏ మాత్రం తీర్చలేకపోతుండడంతో మహిళలకు నీటి పాట్లు నిత్యకృత్యంగా ఉంటున్నాయి.

22 ఏళ్ల నాటి పథకమే దిక్కు

యలమంచిలి మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో 2003లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఎస్.రాయవరం మండలం సోముదేవపల్లి దగ్గర వరాహ నది నుంచి 16 గ్రామాలకు నీటి సరఫరా కోసం సమగ్ర రక్షిత నీటి పథకాన్ని ఏర్పాటు చేసింది. అప్పట్నుంచి వరాహ నదిలో తవ్విన బావుల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ఈ పథకం నిర్వహణను గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చూసేవారు. 2011లో యలమంచిలి మున్సిపాలిటీగా ఉన్నతీకరణ పొందిన తర్వాత గ్రామీణ నీటి సరఫరా విభాగంతోపాటు యలమంచిలి పురపాలక సంఘం అధికారులు సంయుక్తంగా దీని నిర్వహణ చూస్తున్నారు. అయితే 22 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ పథకం బోర్లు, పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినపుడు, సాంకేతిక సమస్యలు ఏర్పడినపుడు వరాహనదిలో బోర్ల నుంచి నీటి పంపింగ్ నిలిచిపోతోంది. ఫలితంగా పలు గ్రామాలతో పాటు యలమంచిలి పట్టణానికి నీటి కొరత పట్టిపీడిస్తోంది.

కావాల్సింది 7.5 ఎంఎల్‌డీ.. సరఫరా 3 ఎంఎల్‌డీ

పట్టణంలో ప్రజలకు అవసరమైన నీటికి, ప్రస్తుతం సరఫరా అవుతున్న మంచినీటి మధ్య భారీ వ్యత్యాసం ఉంది. 50 వేల జనాభా ఉన్న పట్టణానికి అధికారుల లెక్కల ప్రకారం రోజుకు 7.5 ఎంఎల్‌డీ నీరు అవసరం. ప్రస్తుతం సోముదేవపల్లి వద్ద వరాహనది నుంచి రోజుకు 1.72 ఎంఎల్‌డీ నీరు మాత్రమే సరఫరా జరుగుతోంది. పట్టణంలో 160 వరకు చేతిబోర్లు ఉన్నాయి. వీటి నుంచి 1.40 ఎంఎల్‌డీ నీరు అందుబాటులో ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఇవి కాకుండా మరికొన్ని బోర్ల నుంచి సరఫరా అవుతున్న నీటితో కలిపి మొత్తం రోజుకు 3.5 ఎంఎల్‌డీ నీరు సరఫరా అవుతున్నట్టు అధికారులు చెబుతున్నా, వాస్తవానికి అంత మొత్తంలో నీటి సరఫరా జరగడం లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పూర్తి స్థాయిలో నీటి సరఫరా జరిగి ప్రజల నీటి కష్టాలు తీర్చడానికి స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.101.71 కోట్లతో వైఎస్సార్‌సీపీ హయాంలో పథకానికి శ్రీకారం

యలమంచిలి పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర మంచినీటి ఎద్దడి సమస్యను గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కన్నబాబురాజు, ప్రజా ప్రతినిధులు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రూ.101.71 కోట్ల ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్ బ్యాంక్) నిధులతో కొత్తగా సమగ్ర రక్షిత మంచి నీటి సరఫరా అభివృద్ధి పథకం మంజూరు చేశారు. ఈ పథకానికి 2022 సెప్టెంబరు 1న శంకుస్థాపన జరిగింది. అనంతరం పనులు సైతం ప్రారంభమయ్యాయి. పొందూరు సమీపంలో ఇందేశమ్మ వాగు దగ్గర నుంచి పట్టణానికి నీటి సరఫరా జరిగేలా ప్రాజెక్టు రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో కొంత దూరం పైప్‌లైన్లను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత బిల్లుల మంజూరులో జాప్యం, ఎన్నికల కోడ్‌తో పనులు నిలిచిపోయాయి. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16 నెలలుగా ఈ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పథకానికి సంబంధించి తాజాగా మళ్లీ టెండర్లు పిలిచారు. రూ.103 కోట్లతో పథకం పూర్తి చేయడానికి టెండర్ ఖరారు చేశారు. పనులు త్వరలో ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. పథకం పూర్తయితే గానీ యలమంచిలి పట్టణానికి తాగునీటి సమస్య పరిష్కారమయ్యే అవకాశం కనిపించడంలేదు. అప్పటివరకు ప్రజలకు పానీపాట్లు తప్పవు.

తరచుగా అంతరాయం



పట్టణంలో మా వీధితో పాటు పలు వీధుల్లో నీటి సరఫరాకు తరచుగా అంతరాయం ఉంటోంది. ఎప్పుడు నీరు వస్తుందో? తెలియని పరిస్థితి నెలకొంది. ప్రజల కనీస అవసరాల్లో ఒకటైన మంచినీటి సరఫరా సక్రమంగా జరగకపోవడం వల్ల కలుషిత నీటిని ప్రజలు వాడుతున్నారు. అంటురోగాలు వ్యాప్తి చెందితే చాలా ఇబ్బందులు తప్పవు. నిత్యం నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– షేక్ ఆషియా, గాంధీనగరం, యలమంచిలి

నీటి కొరత తీవ్రంగా ఉంది



టిడ్కో హౌసింగ్ కాలనీలో నీటి కొరత తీవ్రంగా ఉంటోంది. ఇక్కడ నివాసం ఉండే వారంతా అనేక ఇబ్బందులు పడుతున్నారు. జన జీవనానికి అత్యంత అవసరమైన నీటి సరఫరాపై అధికారులు దృష్టి పెట్టాలి. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉంది.

– బి. కరుణ, టిడ్కో కాలనీ, యలమంచిలి

స్వయం సహాయక సంఘాలకు కొత్త యాప్



ఒంపోలులో ర్యాలీ నిర్వహిస్తున్న డ్వాక్రా సభ్యులు

మునగపాక: స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన లెక్కలు ఇకపై పక్కాగా ఉండేందుకు బుక్ కీపింగ్ అనే కొత్త యాప్ అందుబాటులోకి తీసుకువచ్చామని వెలుగు ఏపీఎం బాలరాజు తెలిపారు. మండలంలోని ఒంపోలు, మంగళవరపుపేట గ్రామాల్లో సోమవారం మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమంపై ర్యాలీలు నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఏపీఎం మాట్లాడుతూ సంఘాల్లో ఎంతమేర డబ్బులు ఉన్నాయో తెలియక సంఘ ప్రతినిధులు ఏం చెబితే వాటినే నమ్మాల్సి వచ్చేదన్నారు. కొత్త యాప్ ద్వారా ఇంటి నుంచే లెక్కలు చూసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రతి మహిళ మొబైల్ కీపింగ్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. ఒంపోలు సర్పంచ్ సూరిబాబు, సీసీలు వేణు, అనురాధ, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ కె.లక్ష్మి, వీవోఏ వై.లక్ష్మి, పలు గ్రామ సంఘాల ప్రతినిధులు, మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు విరాళాలు



వాడ్రాపల్లిలోని గౌరీ పరమేశ్వరుల ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న దశావతారం



మోదకొండమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న శ్రీనివాస్

మునగపాక: మండలంలో నిర్మిస్తున్న పలు దేవాలయాలకు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. అందులో భాగంగా వాడ్రాపల్లిలోని గౌరీ పరమేశ్వరుల ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన కొయిలాడ దశావతారం లక్ష రూపాయలను విరాళంగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గౌరీ యూత్ సభ్యులు పాల్గొన్నారు. కొయిలాడ దొరప్పలనాయుడు కుమారులు లక్షా 116 రూపాయలు, పవర్‌టెక్ ఇండస్ట్రీయల్ పొల్యూషన్ ఎండీ అనాల అంజిబాబు రూ.50 వేలు, డాల్ఫిన్ డయోగ్నస్టిక్స్ ఎండీ డాక్టర్ సురేష్ రూ.50 వేలు, భూమాత ఎస్టేట్ చైర్మన్ టి.పూర్ణచంద్రరావు రూ.25 వేలు, సెంటర్ పాయింట్ హోటల్ నిర్వాహకులు జి.పురుషోత్తమరెడ్డి రూ.20 వేల వంతున విరాళాలు అందజేశారు. మునగపాక బైపాస్ రోడ్డులోని మోదకొండమ్మ ఆలయ నిర్మాణానికి అనకాపల్లికి చెందిన తురాయి శ్రీనివాస్ రూ.1,11,116 నగదును కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు.

గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు



ఒంపోలులో టీకాల కార్యక్రమం పరిశీలిస్తున్న ఏడీ గణేష్

మునగపాక: సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేస్తున్నామని పశు సంవర్ధక శాఖ ఏడీ సీహెచ్ గణేష్ తెలిపారు. మండలంలోని ఒంపోలులో సోమవారం జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉందన్నారు. ఇందుకోసం ప్రతీ పశువుకు టీకా వేయించాలన్నారు. తద్వారా వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని పెంచుకోవచ్చన్నారు. దూడల్లో మరణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. వ్యాధి సోకిన దుక్కి ఎద్దుల్లో పని సామర్థ్యం పెరుగుతుందన్నారు. నెల రోజుల పాటు టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. నాగులాపల్లి పశువైద్యాధికారి మౌనిక తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళలకు వైద్య శిబిరాలు



వైద్యాధికారి శ్రావ్య

అచ్యుతాపురం రూరల్: మహిళలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి కె.శ్రావ్య తెలిపారు. సోమవారం ఆమె స్థానిక పీహెచ్‌సీలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో మహిళలు పాల్గొని అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ అన్ని ఆరోగ్య కేంద్రాల వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గర్భిణులు, బాలింతలు, కౌమార దశ బాలికలకు సంబంధించి ఆరోగ్యపరమైన సమస్యలపై పరీక్షలు, వారి సందేహాలు, వంటి మరెన్నో విషయాలు చర్చించి పరిష్కారం చేస్తారన్నారు.

మాజీ ఎమ్మెల్యే జోగులు పరామర్శ

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరులో చింతలపాటి వరహాలరాజు మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం పరామర్శించారు. ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో వైద్యం చేయించుకుని తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వరహాలరాజును కలిసి ఆరోగ్య క్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, యేజర్ల సీతారామరాజు, కిరణ్‌రాజు, చోడిపల్లి గోవిందు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించేలా చర్యలు

సిబ్బంది కొరతపై ఉన్నతాధికారుల దృష్టికి
సాక్షి ఎఫెక్ట్...



ఆస్పత్రిలోని తాగునీటి బోరు చుట్టూ పేరుకుపోయిన తుప్పలను తొలగిస్తున్న దృశ్యం



పశు వైద్యాలయం ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ గణేష్

మునగపాక: పాలకుల నిర్లక్ష్యం కారణం రైతులు అవస్థలు పడుతున్నారు. పాడి రైతులకు మెరుగైన సేవలందించాల్సిన వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో లేక ఇబ్బందులు తప్పలేదు. దీనికి తోడు మునగపాక ప్రభుత్వ పశు వైద్యాలయంలో వెటర్నరీ అసిస్టెంట్, సబార్డినేట్ పోస్టులు భర్తీ కాకపోవడంతో రైతులకు సకాలంలో సేవలందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీజన్‌లో పశువులకు అంటు వ్యాధులు ప్రబలే పరిస్థితులు లేకపోలేదు. దీనిలో భాగంగా ఈ నెల 12వ తేదీన సాక్షి దినపత్రికలో 'పడకేసిన పశువైద్యం' పేరిట కథనం వెలువడింది. ఇందుకు సంబంధిత అధికారులు స్పందించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సీహెచ్ గణేష్ సోమవారం మునగపాకలో ప్రభుత్వ పశువైద్యాలయాన్ని సందర్శించారు. ఆస్పత్రి ప్రాంగణం పరిశీలించారు. ఇక్కడకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. తిమ్మరాజుపేటకు చెందిన జూనియర్ వెటర్నరీ డాక్టర్ కోదండరామ్ ఇక్కడి రైతులకు సేవలందిస్తారన్నారు. అతనితోపాటు నాగులాపల్లికి చెందిన పశువైద్యాధికారి మౌనిక పశువులకు చికిత్సలు అందజేస్తారన్నారు. ఇక్కడి ఆస్పత్రిలోని సిబ్బంది కొరతకు సంబంధించి డీడీ, డీహెచ్‌వోల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి రూరల్: స్థానిక సెక్షన్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కే రాజశేఖర్ తెలిపారు. యలమంచిలి ఉప కేంద్రం పరిధిలో కొత్తపాలెం, రామారాయుడుపాలెం, సోమలింగపాలెం, కట్టుపాలెం, నెహ్రూనగర్, గాంధీనగర్, ద్వారకానగర్, ఫైర్ ఆఫీస్ కాలనీ, రామాలయం కాలనీ, ఇందిరమ్మ, పట్టణ పరిధిలో వ్యవసాయ కనెక్షన్లు, పెదపల్లి ఉపకేంద్రం పరిధిలో కొక్కిరాపల్లి, వెంకటాపురం, అత్తిలివారిచేలు, పెదపల్లి వ్యవసాయ కనెక్షన్లు, పెదపల్లి, గొల్లలపాలెం, మంత్రిపాలెం, చిన్న కొక్కిరాపల్లి, వెంకటాపురం, కొక్కిరాపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ఎరువుల కోసం ఎగబడ్డ రైతులు



కొరుప్రోలు పీఏసీఎస్ వద్ద ఎగబడ్డ రైతులు

ఎస్.రాయవరం: కొరుప్రోలు పీఏసీఎస్ వద్ద సోమవారం యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో యూరియా వచ్చిన సమాచారం తెలుసుకుని పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. అదే సమయంలో కొందరు రైతులు యూరియాతో పాటు డీఏపీ, గ్రోమోర్ వంటి కాంప్లెక్స్ ఎరువులు ఎందుకు అందుబాటులో ఉంచడంలేదని వ్యవసాయాధికారి సౌజన్యను ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఆర్బీకేల్లోనూ ఎరువులు, విత్తనాలు సరఫరా చేసేవారని, ఇప్పుడు ఎందుకు కొనసాగించలేదని నిలదీశారు. గోకులపాడు, గెడ్డపాలెం, గుర్రాజుపేట తదితర గ్రామాల నుంచి ఎరువులు కోసం, అత్యవసరమైన యూరియా కోసం కొరుప్రోలు రావాల్సి వస్తుందని ప్రశ్నించారు. తీరా వచ్చాక ఇక్కడ అధికారులు వచ్చేవరకు సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసలే వర్షాలు ఆలస్యంగా కురిసి ఇబ్బందులు పడుతుంటే, ఎరువులు కొరత మరింత బాధిస్తుందన్నారు. ఏవో మాట్లాడుతూ రైతులు అవసరం మేరకు కాంప్లెక్స్ ఎరువులు తీసుకువస్తామని, ప్రస్తుతం మండలంలో యూరియా కొరత లేదని చెప్పారు. పీఏసీఎస్ వద్ద రైతులు ఎగబడిన సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ రమేష్‌బాబు అక్కడకు వచ్చి ఎరువులు గొడౌన్ తనిఖీ చేశారు. రైతులు క్యూ కట్టే పరిస్థితి లేకుండా ఎరువుల పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

యలమంచిలి రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం యలమంచిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం అలసత్వం చూపుతోందన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని ఆర్థిక ప్రయోజనాలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వేణు, జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు, రాష్ట్ర కౌన్సిలర్ కే శ్రీనివాసరావు, మల్లిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



హిందీ దివస్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ సోమవారం ఘనంగా నిర్వహించారు. హిందీని సులభంగా అభ్యసించడానికి వీలుగా విద్యార్థులు తయారు చేసిన మెటీరియల్ ఆకట్టుకుంది. వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం అంశాలపై దృష్టి సారించినట్టయితే హిందీ భాషలో ప్రావీణ్యత సాధించవచ్చని హెచ్ఎం సుధామాధురి చెప్పారు. విద్యార్థుల ప్రదర్శన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాను, శ్రీనివాసరావు పాల్గొన్నారు.